క్లుప్తంగా

జవాన్ల ఆత్మీయ సమ్మేళనం



పెనుగంచిప్రోలు: జగ్గయ్యపేట నియోజకవర్గ జవాన్లు గురువారం మునేరు అవతల లక్ష్మీ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహించే జవాన్లు అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను వారు సత్కరించారు. కార్యక్రమంలో జవాన్లు గోను గుంట్ల రాజు, దారావతు నరసింహారావు, జె.రామ్మోహనరావు, వి.కిషోర్, ఆర్.ప్రవీణ్, వినోద్, కె.జయకుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల నిర్వాహకులపై కేసు

జగ్గయ్యపేట: సంక్రాంతి పండుగ సందర్భంగా సర్కిల్ పరిధిలో కోడి పందేలు, జూద క్రీడల నిర్వాహకులపై గురువారం కేసులు నమోదు చేశారు. మొత్తం 36 కేసులు నమోదయ్యాయి. జగ్గయ్యపేట పట్టణంలో ఐదు, చిల్లకల్లు స్టేషన్ పరిధిలో 11, వత్సవాయి పరిధిలో తొమ్మిది, పెనుగంచిప్రోలు పరిధిలో 11 కేసులు నమోదయ్యాయి.

స్థల పరిశీలన



గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామంలోని జాతీయ రహదారి పక్కనున్న ప్రైవేట్ స్థలాన్ని గురువారం నందిగామ ఆర్డీవో బాలకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా పెట్రోల్ బంకు ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్, ఆర్ఐ సూరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గోపయ్య మృతి పార్టీకి తీరని లోటు



పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు ఎత్తిపోతల పథకం మాజీ చైర్మన్ కాకాని గోపయ్య మరణం పార్టీకి తీరని లోటని నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ అన్నారు. గోపయ్య సంస్మరణ సభ గురువారం పెనుగంచిప్రోలులో నిర్వహించారు. గోపయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, తదితరులు నివాళులర్పించారు.

క్రీడా పోటీలు ప్రారంభం

మైలవరం: మన్నె ప్రభుదాసు, జయకుమార్, శ్రీను జ్ఞాపకార్థం ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన రెడ్డిగూడెం గ్రామంలో యువతకు షటిల్, క్యారమ్స్, మహిళలకు టెన్నికాయిట్, కబడ్డీ పోటీలు గురువారం ప్రారంభించారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయని ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయ్‌కుమార్ తెలిపారు. విజేతలకు ఈ నెల 18న బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ జి. విశ్వనాథ్, మన్నె శాంతికుమార్, బండపల్లి ప్రేమ్‌కుమార్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సినీనటుడు శోభన్‌బాబు జయంతి



విజయవాడకల్చరల్: సినీనటుడు శోభన్‌బాబు సినీ రంగసేవలను ఆదర్శంగా తీసుకోవాలని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. ఎస్‌కేపీ సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం సినీనటుడు శోభన్‌బాబు జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన రమాసత్యనారాయణ మాట్లాడుతూ.. శోభన్‌బాబు అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించారని, మహిళా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. క్రమశిక్షణకు మారుపేరు శోభన్ బాబు అని కొనియాడారు. ఆయన గొప్ప మానవతా మూర్తి అని, పేద కళాకారులకు సహాయం చేసేవారన్నారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, కె.డేవిడ్ రాజు, జయప్రభ, జోషి పాల్గొన్నారు.

మురుగునీటిలో ప్రయాణం

- ప్రధాన రహదారి అధ్వానం
- పేరకలపాడులో రోడ్డు వెంట మురుగునీరు
- డ్రెయిన్లు లేవు
- వాహనచోదకులు అవస్థలు

కంచికచర్ల: కాలంతో సంబంధం లేదు కంచికచర్ల మండలం పేరకలపాడులో. వానలు కురవకపోయినా రోడ్డుపై మురుగునీరు నిలిచే ఉంటుంది. రోడ్లకు రెండువైపులా సక్రమమైన డ్రెయినేజీలు లేకపోవడంతో రోడ్డుపక్కనే మురుగునీరు నిలుస్తోంది. ఈ గ్రామంలో సుమారు 3,500 మంది ప్రజలు నివసిస్తున్నారు. దీంతో వాహనచోదకులు సైతం అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు.

రోడ్డుపై మురుగు

పేరకలపాడు గ్రామంలో ప్రధాన రోడ్డు ఒక్కటే ఉంది. ఇది అన్ని సామాజిక వర్గాల ప్రజలకు ఏకైక మార్గం. ఈ రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థలు లేకపోవడంతో ఇళ్లలో వాడుకనీరు రోడ్డుపై నిలుస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బీసీ కాలనీ సమీపంలో కూడా ఇదే పరిస్థితి. మురుగునీటిలో వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి ఉండటంతో కొందరు వాహనచోదకులు జారి పడిన పరిస్థితులు ఎదురయ్యాయి.

దోమలకు ఆవాసకేంద్రాలుగా..

గ్రామంలో రోడ్డుకు రెండువైపులా సక్రమమైన డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లలో వాడుకునే మురుగు నీరు నిలిచిపోతోంది. మురుగునీటిలో దోమలు వ్యాపించి అంటురోగాలు ప్రబలుతున్నాయని పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ రోజులు మురుగునీరు నిల్వ ఉండి తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.



పేరకలపాడు గ్రామంలో రోడ్డు పక్కన మురుగునీరు

ఓ ఇంజినీరింగ్ కళాశాల.. దత్తత తీసుకున్న గ్రామమిది

పేరకలపాడు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల గ్రామాన్ని దత్తత తీసుకుంది. గతంలో కళాశాల యాజమాన్యం ఆ గ్రామానికి మౌలిక వసతులు కల్పించేది. రెండు కిలోమీటర్ల మేర వీధి లైట్లు, ఎంపీయూపీ పాఠశాలకు అవసరమైన బల్లలు, బ్లాక్‌బోర్డులు, విద్యార్థులకు నోటు పుస్తకాలు వంటివి ఉచితంగా పంపిణీ చేశారు. శానిటేషన్ విషయంలో ఎటువంటి శ్రద్ధ తీసుకోకపోవటంతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామంలో రోడ్లకు ఇరువైపులా డ్రెయిన్లు నిర్మించాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై మురుగునీరు పారుతుండటంతో ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు

మురుగు నిలవకుండా చూడాలి



గ్రామంలో రోడ్లకు సరైన డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు పారక నిలిచిపోతోంది. వాటిలో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. ఆ ప్రాంతంలోని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పంచాయతీ అధికారులు చొరవ తీసుకుని గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలి.

–కందుల అశోక్, పేరకలపాడు

భద్రతా నియమాలను విధిగా పాటించాలి

నందిగామ టౌన్: వాహనచోదకులు రోడ్డు భద్రతా నియమాలను విధిగా పాటించాలని ఆర్డీవో పద్మావతి పేర్కొన్నారు. స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15 వరకు మాసోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. వాహనచోదకులు సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించటం, ఓవర్ లోడు, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. రోడ్డు నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంవీఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద రహిత ప్రయాణం చేయాలి

జగ్గయ్యపేట అర్బన్: రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రతి ఒక్కరూ ప్రమాద రహిత ప్రయాణం చేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎంవీ నారాయరాజు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రాంతీయ రవాణాశాఖ యూనిట్ కార్యాలయం వద్ద జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను ఎంవీఐ నారాయణరాజు జెండా ఊపి వివిధ శాఖల అధికారులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 15 వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంవీఐ నారాయణరాజు, ఎక్సైజ్ సీఐ గురవయ్య, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, పేట ఎస్ఐ జి.రాజు, చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ డీఈఈ పరశురాముడు, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ హరీష్‌తో కలసి ఎంవీఐ రాజు బ్రోచర్‌లను విడుదల చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎంవీ.అలామ్, సీహెచ్.శరత్‌చంద్ర తదితర అధికారులు, వాహనచోదకులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా మాసోత్సవాలను ప్రారంభిస్తున్న అధికారులు



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎంవీఐ నారాయణరాజు తదితరులు

క్రీస్తు మార్గంలో నడుచుకోవాలి

జగన్నాథపురం(వీరులపాడు): క్రీస్తు చూపిన ప్రేమ మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని రెవ. ఫాదర్ సుగుణరావు పేర్కొన్నారు. మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని నిత్య సహాయ మాత దేవాలయంలో సహాయ మాత మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం ప్రత్యేక ప్రార్థనలు, దివ్యబలిపూజ, తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషుల పాప విమోచనకే ప్రభువు ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చారన్నారు. రాత్రికి పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేరిమాత విగ్రహాన్ని ఊరేగించారు. శుక్రవారం జరిగే కార్యక్రమాల్లో వరంగల్ నేత్రాసన బిషప్ ఉడుముల బాల పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి విజయ్‌పాల్‌రెడ్డి, నేతలు బాలస్వామి, నరసింహారెడ్డి, జ్ఞానారెడ్డి, చిన్నపరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నిత్య సహాయ మాత మహోత్సవాల్లో క్రీస్తు సందేశాన్ని అందిస్తున్న ఫాదర్ సుగుణరావు

ఎరువుల దుకాణాల తనిఖీ

జి.కొండూరు: ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే సదరు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అంతర్గత తనిఖీ స్క్వాడ్ ప్రతినిధులు, నందిగామ ఏడీఏ శ్రీనివాస్, మైలవరం ఏఓ సంధ్య అన్నారు. మైలవరం, జి.కొండూరు మండలాల పరిధిలోని ఎరువులు, పురుగు మందుల షాపులను గురువారం వారు తనిఖీ చేశారు. రికార్డులు, షాపులలో స్టాక్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులకు రబీ సాగుకు ఇబ్బంది తలెత్తకుండా డీఏపీ, యూరియా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ రాంకుమార్ పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించారు.. అప్రోచ్ రోడ్డు మరిచారు!

- సంగమ ప్రాంతంలో మొదలుకాని 'అప్రోచ్' పనులు
- కాజువేపై నుంచి వైరా ఏరు
- వర్షానికి కాజ్‌వేపై పెద్ద గోతులు

కంచికచర్ల: రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు రాకపోకలను సాగించడానికి వైరా, కట్టిలేరుపై నాటి ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, అప్రోచ్ రోడ్డు వేయడం మరిచారు. దీంతో వినియోగించుకునే అవకాశం లేకుండా పోయింది. వానలు, వరదలు వచ్చిన ప్రతిసారీ రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. కంచికచర్ల మండలం చెవిటికల్లు నుంచి వత్సవాయి వరకు వేసిన ఆర్అండ్‌బీ రోడ్డు మార్గాన నందిగామ, వీరులపాడు మండలాల మధ్య వైరా, కట్టిలేరు కూడలి సంగమ ప్రాంతంలో నిర్మించిన కాజ్‌వేపైకి నీరు చేరిన ప్రతిసారీ రాకపోకలు నిలిచిపోతున్నాయి. గత ఏడాది ఆగస్టులో భారీగా కురిసిన వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లాయి. దీంతో కట్టలేరు వైరా ఉపనదులు ఉధృతంగా ప్రవహించడంతో వారం రోజుల పాటు రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి.

వరదొస్తే.. రాకపోకలు బంద్

నందిగామ మండల పరిధిలోని దాములూరు, వీరులపాడు మండల పరిధిలోని పల్లెంపల్లి గ్రామాల మధ్య వైరా, కట్టిలేరు సంగమ ప్రాంతం ఉంది. ఉప నదులను దాటేందుకు దశాబ్దాల క్రితం కాజ్‌వే నిర్మించారు. రానురాను రాకపోకలు అధికమయ్యాయి. దీనికితోడు ఖమ్మం జిల్లాకు వీరులపాడు మండలం బోర్డర్‌గా ఉండటంతో తెలంగాణ వైపు నుంచి వీరులపాడు మండలానికి, నందిగామ మండలానికి వచ్చే వారు ఈ మార్గాన్ని ఎక్కువగా ఆశ్రయిస్తారు. వానాకాలంలో ఎగువన తెలంగాణలో భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ వైరా, కట్టిలేరు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. ఇక సంగమ ప్రాంతం కావడంతో ఇక్కడ వరద ఉధృతి మరింత అధికంగా ఉంటుంది. ఇలాంటి సమయాల్లో రోడ్డు దాటేందుకు సాహసించిన పలువురు కొట్టుకుపోయారు. ఒకసారి ఏకంగా ఆర్టీసీ బస్సు వరద ఉధృతికి కొట్టుకుపోయినా, ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో కాజ్ వే స్థానంలో బ్రిడ్జి నిర్మించాలంటూ ప్రజలు కోరుతూ వచ్చారు. ఇటీవల వీరులపాడు మండల పరిధిలోని పెద్దాపురం వద్ద వైరా ఉధృతి కారణంగా ఏనుగు గడ్డ వాగు పొంగి ఓ యువకుడు మృతిచెందాడు.

వర్షాలకు కొట్టుకుపోయిన కాజ్‌వే

ఇటీవల భారీగా కురిసిన వర్షాలకు కాజ్‌వేపై ఉధృతంగా వరదనీరు ప్రవహిస్తుండటంతో పూర్తిగా కొట్టుకుపోయింది. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కాజ్‌వేకు ఏర్పాటు చేసిన బండరాళ్లు లేచిపోవటంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి.

ఎన్నేళ్లు ఎదురుచూడాలి

ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు ఆనాటి ప్రభుత్వం కాజ్‌వే స్థానంలో బ్రిడ్జి నిర్మాణానికి 2015లో ప్రభుత్వం రూ.6.47 కోట్లు మంజూరు చేసింది. 2016లో నిర్మాణ పనులు ప్రారంభించి, 2017లోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసింది. కేవలం అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయలేక నాటి పాలకులు చేతులెత్తేశారు. అటు పల్లెంపల్లి వైపు, ఇటు దాములూరు వైపు అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరగలేదు. దీనికి రైతుల నుంచి భూమిని సేకరించినా, నష్ట పరిహారం సక్రమంగా చెల్లించలేదు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా, దానిపై రాకపోకలు సాగించే అవకాశం ప్రజలకు దక్కలేదు.



దాములూరు కూడలి సంగమం వైరా ఉపనదిపై అప్రోచ్ రోడ్డు లేక వినియోగంలోకి రాని బ్రిడ్జి..



ఇటీవల కురిసిన వర్షాలకు కాజ్‌వేపై పారుతున్న వరద నీరు(ఫైల్)



ఇటీవల భారీగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కాజ్‌వే

నిధుల కొరతతో..

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో సకాలంలో దీన్ని పూర్తి చేయగలిగాం. నిధుల కొరత కారణంగా అప్రోచ్ పనులు చేయలేకపోయాం. ఈ విషయం ఇప్పటికే ఉన్నతాధికారుల పరిశీలనలో ఉంది. తాజాగా మరోసారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తాం.

–ఆర్అండ్‌బీ డీఈఈ శశిభూషణ్

మూడు రోజులు జోరుగా పందేలు

- అర్ధరాత్రి దాటినా సాగిన జూదాలు
- నిబంధనలకు నీళ్లు
- పట్టించుకోని పోలీసులు

పెనుగంచిప్రోలు: సంక్రాంతి మూడు రోజులూ పందేలు జోరుగా సాగాయి. కోళ్ల కంటే రూ.కోట్లే పైకి ఎగిరాయి. పండుగలో మూడో రోజు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కేసినో తరహాలో పేకాట, గుండాట, నంబర్ల ఆట, కోతాట యథేచ్ఛగా సాగాయి. అధికారులు ఎవ్వరూ అటు పక్క కూడా చూడలేదంటే కూటమి నాయకులు పందేలు ఏ రేంజ్‌లో నిర్వహించారో అర్థమవుతోంది. గతంలో ఎన్నడూ చూడని విధంగా సంక్రాంతికి విచ్చలవిడిగా కోడి పందేలు, వాటి వద్దే వివిధ రకాల జూదాలు ఏర్పాటు చేశారు. అడ్డు అదుపూ లేకుండా మద్యం విక్రయాలు సాగటంతో మందుబాబులు, జూదగాళ్లు పేట్రేగి పోయారు. పెనుగంచిప్రోలు కంఠంనేని గార్డెన్స్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత పేకాట భారీగా నిర్వహించారు. ఇక్కడ రూ.కోట్లలో నగదు చేతులు మారినట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున కోడె పందేలు, జూదాలు జరిగినా 9 కేసులకు సంబంధించి 18 మందిపై మాత్రమే పోలీసులు కేసులు నమోదు చేయడం గమనార్హం.



పెనుగంచిప్రోలులో జూదశిబిరం

న్యాయం జరిగేలా విచారణ చేయండి

సీఐ చవాన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

చందర్లపాడు(నందిగామ టౌన్): మృతి చెందిన వీరమణితేజ, కుటుంబానికి న్యాయం చేసేలా పోలీసులు విచారణ జరగాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు పీఎస్‌లో గురువారం నందిగామ రూరల్ సీఐ చవాన్‌ను కలిసి మృతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అవినాష్, జగన్మోహనరావుమాట్లాడుతూ మృతి విషయాన్ని సీపీ దృష్టికి తీసుకెళ్లామని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలన్నారు. రెండు, మూడు నెలల నుంచి రాజకీయ ప్రేరేపిత చర్యలు జరుగుతున్నాయని మణితేజ మృతిలో తమకు, కుటుంబ సభ్యులకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదమైతే శరీరంలో ఎక్కడో ఒక చోట గాయాలవుతాయని ద్విచక్ర వాహనం దెబ్బతింటుందని అటువంటివి ఏమీ కనిపించలేదని నడినెత్తిపై ఉన్న గాయాన్ని చూస్తే హత్యగానే అనిపిస్తోందని తెలిపారు. హత్య కేసుగా నమోదు చేసి ఆ కోణంలోనే దర్యాప్తు చేయాలని సూచించారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. దీనిపై స్పందించిన సీఐ మాట్లాడుతూ మృతి విషయం తెలిసిన తర్వాత రోడ్డు ప్రమాదంగా భావించినా కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేలా పారదర్శక విచారణ చేస్తామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మృతుని తండ్రి నల్లాని సాయి, బండారుపల్లి కపిల్, నల్లాని అయ్యన్న, నేతలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



చందర్లపాడులో సీఐతో మాట్లాడుతున్న అవినాష్, జగన్మోహనరావు, తన్నీరు, ఇంటూరి తదితరులు

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

వత్సవాయి: వాణిజ్య పంటలను సాగుచేస్తూ ప్రతిసారి నష్టాలను చవిచూస్తున్న రైతుల్లో మార్పు కనిపించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఇప్పుడిప్పుడే దృష్టి సారిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 13 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు లేవు. మంచి పూత, పిందెల దశలో ఉన్నప్పుడు పడిన అకాలవర్షాలకు పూత, పిందె మొత్తం రాలి నష్టపోయారు. డిసెంబర్‌లోనే పత్తి పంట పూర్తికావడంతో పంటను తొలగించారు. నాలుగునెలలపాటు పొలాన్ని ఖాళీగా ఉంచడానికి ఇష్టపడని రైతులు కొందరు నీటి అవకాశం ఉన్నవారు మొక్కజొన్న, వేరుశనగపంటపై దృష్టి సారించారు. గోపినేనిపాలెం, మంగొల్లు, కన్నెవీడు, వత్సవాయి, మక్కపేట, కంభంపాడు ఇందుగపల్లి ప్రాంతాల్లో పంటను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో శనగవిత్తనాలు కూడా హైబ్రిడ్ రకం వచ్చాయి. పంటమార్పిడి కారణంగా వేరుశనగ దిగుబడులు కూడా బాగానే వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఎకరానికి 20 నుంచి 30 బస్తాల వరకు దిగుబడులు రానున్నాయి. నీటి వసతి అందుబాటులో ఉన్న వారు ఎక్కువగా ఈ పంటపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలో ప్రస్తుత సీజన్‌లో 100 ఎకరాలవరకు పంటను నాటారు. పెట్టుబడులు తక్కువతోపాటు శ్రమ కూడా పెద్దగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.



వత్సవాయిలో సాగు దశలో వేరుశనగపంట

ఆత్మీయుల అపూర్వ కలయిక

రూ. 1.30 లక్షలతో సైకిల్‌స్టాండ్

జుజ్జూరు(వీరులపాడు): జుజ్జూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 2005 పదో తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలో కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తాము చదువుకున్న తరగతి గదులను, పాఠశాల ఆవరణలో తిరుగుతూ పాత మిత్రులతో మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. నృత్యాలు, ఆటలు, కబుర్లతో సరదాగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పి ఉన్నతికి కృషి చేసిన అలనాటి ఉపాధ్యాయులు రాయల కోటేశ్వరరావు, కొమ్మూరి శేషు, యరమాల నాగిరెడ్డి, భాను నాయక్, షేక్ ఖాదర్‌బాబులను ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల సహకారంతో రూ. 1.30 లక్షలతో పాఠశాల ఆవరణలో నిర్మించిన సైకిల్ స్టాండ్‌ను ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



జుజ్జూరు జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులతో సైకిల్‌స్టాండ్‌ను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో సేవా కార్యక్రమాలు చేయాలని వాకర్స్‌క్లబ్ పాస్ట్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, ఏఆర్టీ సెంటర్ కౌన్సిలర్ వరప్రసాద్ అన్నారు. స్థానిక బీఆర్టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం నిరుపేద చిన్నారులకు దుప్పట్లు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ.. చలికాలంలో చిన్నారులు ఇబ్బందులు పడకుండా దుప్పట్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దాతలు, సంస్థల సేవలను సద్వినియోగంచేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. ట్రస్ట్ సభ్యులు కోరంగి నాగమల్లీశ్వరి, ఎస్కే షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

జేడీ తాహేరా సుల్తానాకు అభినందన

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ విభాగంలో జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన తాహేరా సుల్తానాను పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల నాయకులు గుంటూరులోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పీఆర్టీయూ నేతలు పాల్గొన్నారు.